# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పదో తరగతి మార్కుల మెమోలో మార్పులు

- సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పదో తరగతి వారికి ఇప్పటి వరకు మెమోలపై గ్రేడ్లు, సీజీపీఏ రూపంలో ఇవ్వగా ఇకపై సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్ల రూపంలో ఇవ్వనున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రతిపాదనను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఫలితాలు రెండు మూడు రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీబీఎస్ఈలోనూ సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇస్తున్నారు. 10వ తరగతి బోర్డు పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగాయి.తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదలైన తర్వాత విద్యార్థులు తమ ఎస్ఎస్‌సీ మార్క్స్ మెమో 2025ను తెలంగాణ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లు bse.telangana.gov.in, bseresults.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ వెబ్‌సైట్లలో మీ మీ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి ఫలితాలు పొందవచ్చు. తెలంగాణ వ్యాప్తంగా ఎస్ఎస్‌సీ విద్యార్థులు రిజల్ట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఈ ఫలితాలను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది

# నిత్యం ప్రజల్లో ఉండాలి

- అలా ఉంటేనే పథకాలు ప్రజలకు చేరువవుతాయి
- ఇప్పుడు పథకాలను ప్రచారం చేసుకోవటంలో వెనుకబడ్డాం ఈ విషయంలో దూకుడు పెంచాలి
- కొందరు ఎమ్మెల్యేలకు పొగరు పెరిగింది
- హైదరాబాద్‌లో టైమ్‌పాస్ చేయడం సరికాదు
- ఓపికగా ఉంటే పదవులు వస్తాయి
- మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర అభద్రతా భావంలో ఉన్నారు
- బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- ప్రధాని మోడీ, కేసీఆర్ రోజుకో మాట మారుస్తారు
- మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డి
- ఈ అంశంపై జానారెడ్డి, కేకే పార్టీలో చర్చిస్తారు
- మాజీమంత్రి జానారెడ్డితో సీఎం భేటీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి మరోసారి సూచన చేశారు. నిత్యం ప్రజల్లో ఉండాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించారు. అలా ఉంటేనే పథకాలు ప్రజలకు చేరువవుతాయని తెలిపారు. ఓపికగా ఉంటేనే పదవులొస్తాయనీ, అందుకు అద్దంకి దయాకరే ప్రత్యక్ష ఉదాహరణని వివరించారు. అలాగాక ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నష్టపోతా రని హెచ్చరించారు. తానింకా ఇరవై ఏండ్లపాటు రాజకీయాల్లో ఉంటానని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు, అమలు చేసిన పథకాలను ప్రచారం చేసుకోవటంలో వెనుకబడ్డామని ఆయన వాపోయారు. ఈ విషయంలో దూకుడు పెంచాల్సి ఉందని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేత జానా రెడ్డితో తెలంగాణ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.. ఈ సందర్భంగా తెలంగాణ–ఛత్తీస్‌ఘడ్ బోర్డర్ లో నెలకొన్న పరిస్థితులు.. కర్రెగుట్టలో కూంబింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై చర్చ జరిగింది.. పీస్ కమిటీ సూచించిన అంశాలపై జానారెడ్డితో చర్చించారు.. 2005లో జరిగిన శాంతి చర్చలపై సీఎం ఆరా తీయగా.. అప్పటి కాంగ్రెస్ నిర్ణయాలను జానారెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు.

జానా రెడ్డితో భేటీ అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. కగార్‌పై పార్టీలో నిర్ణయం తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని తెలిపారు. నిన్న తాము నిర్ణయం ప్రకటించాకే కేంద్రానికి లేఖ రాస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని రేవంత్ గుర్తుచేశారు. బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ అభద్రతాభావంలో మాట్లాడారని.. ఆయన స్పీచ్‌లో క్లారిటీ లేదంటూ పేర్కొన్నారు. కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారని.. రాహుల్‌గాంధీకి, తనకు గ్యాప్ ఉందనడం అవాస్తవమంటూ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ, తాను రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్నామని.. ఆ విషయం బయటకు చెప్పాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు.. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలన్నారు.

అలాగే ఎమ్మెల్యేలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు ఎమ్మెల్యేలకు పొగరు పెరిగింది.. సీఎల్పీలో చెప్పినా తీరు మారలేదని సీఎం పేర్కొన్నారు.. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో టైమ్‌పాస్ చేయడం సరికాదంటూ పేర్కొన్నారు. పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీలో అంతర్గత విషయాలు, కొందరు నేతల విమర్శలు.. గురించి కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి.. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నష్టపోతారంటూ.. క్లియర్ కట్‌గా చెప్పారు. కొందరు పదవులు రాలేదని నోరుజారుతున్నారని.. వాళ్లకు పదవులు రావు.. అవకాశాలు ఉండవంటూ స్పష్టంచేశారు. పార్టీలో ఓపికతో ఉంటే పదవులు వస్తాయని చెప్పారు.

### కాల్పులు విరమించండి

# శాంతి చర్చలకు జరపండి..

- కేంద్రానికి భాకాపా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ విజ్ఞప్తి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి తమను చర్చలకు పిలవాలని భాకాపా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కోరింది. శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణం సృష్టించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. సమయావధితో కూడిన కాల్పుల విరమణ ప్రకటించి, ఎలాంటి షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని భాకాపా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ లేఖలో కోరారు. 2024 జనవరి నుంచి కేంద్ర, రాష్ట్ర పోలీసు, పారామిలిటరీ, కమాండో బలగాలు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాల్లో వందలాది మంది మావోయిస్టులను, అమాయక ఆదివాసులను హత్య చేయడాన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా అనేక ప్రజాస్వామిక, విప్లవ ప్రజా సంఘాలు, పార్టీలు, సామాజిక సంస్థలు, కార్యకర్తలు, ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ మేధావులు వందలాది మంది ఉద్యమిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేసి, కాల్పులు విరమించి ప్రభుత్వం, మావోయిస్టులు కలిసి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. తమ పార్టీ కేంద్రకమిటీ ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని, మార్చి 28వ తేదీన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశామని గుర్తుచేశారు. మా పీ.ఎల్.జీ.ఏ. బలగాల సాయుధ చర్యలను నిలిపివేయాలని తమ కామ్రేడ్స్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. శాంతి చర్చల కోసం తమ పార్టీ వైపు నుంచి ఇచ్చిన ప్రకటన, దండకారణ్యంలోని ఉత్తర్–పశ్చిమ్ సబ్ జోనల్ బ్యూరో వైపు నుంచి కామ్రేడ్ రూపేశ్ ఇచ్చిన రెండు ప్రకటనలతో కలిసి ఇప్పటికే మూడు పత్రికా ప్రకటనలు విడుదల అయ్యాయని తెలిపారు.

జార్ఖండ్ రాష్ట్రంలో బొకారో హత్యాకాండలో మా కేంద్రకమిటీ సభ్యుడు వివేక్ తదితర కామ్రేడ్స్‌ను హత్య చేశారని అన్నారు. మిగతా మావోయిస్టులు లొంగిపోకపోతే ఇదే గతి పడుతుందని హెచ్చరికలు చేస్తున్నాయని అన్నారు. భారతదేశ రాజ్యాంగంలో రాసుకున్న మనిషికి జీవించే హక్కును కాలరాచి వేస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికయ్యామయ్యామని చెప్పుకుంటూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. ఆయుధాన్ని ఆయుధంతోనే ఎదుర్కొంటామని బహిరంగంగానే మాట్లాడుతున్నాయని తెలిపారు. ఛత్తీస్ గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో కర్రెగుట్టల ప్రాంతాన్ని దిగ్బంధించి తెలంగాణ, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర నుంచి 10 వేల మంది పోలీసు, పారామిలిటరీ, కమాండో బలగాలను మోహరించి 5 రోజుల నుంచి పెద్ద ఆపరేషన్ సాగిస్తూ మా కామ్రేడ్స్ ను ఆరుగురిని హత్య చేయడమే కాకుండా పార్టీ నాయకత్వాన్ని హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని వాపోయారు. ఒకవైపు ప్రభుత్వం, మా పార్టీ ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ విధంగా విప్లవకారులపై, ఆదివాసులపై హత్యాకాండలు సాగిస్తే శాంతి చర్చల కోసం కొనసాగుతున్న ప్రక్రియకు ఏమాత్రం అర్థం లేకుండా పోతుందని అన్నారు. శాంతి చర్చలకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం కోసం ఈ హత్యాకాండలను ఆపాల్సిందిగా, దేశవ్యాప్తంగా ఛత్తీస్ గఢ్, ఝార?ండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో సమయావధితో కూడిన కాల్పుల విరమణను ప్రకటించాల్సిందిగా మా పార్టీ కేంద్రకమిటీ మరోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శాంతి చర్చల కోసం, సమస్య పరిష్కారం కోసం తమ న్యాయమైన ఈ డిమాండ్‌కు మద్దతు ప్రకటించాలని.. శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించాలని.. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా యావత్తు ప్రజాస్వామికవాదులను, శాంతికాములను, పీడిత ప్రజలను, పీడిత సెక్షన్లను, పీడిత జాతులను కోరారు.

## లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నూతనంగా నియామితులైన తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్తలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోకాయుక్త ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉపలోకాయుక్త బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

లోకాయుక్త, ఉప లోకాయుక్తల పదవీ కాలం 5ఏళ్లు. వారి వయసు 70ఏళ్లు నిండటం లేదా ఐదేళ్ల పదవి కాలం ఏది ముందు వర్తిస్తే ఆ మేరకు పదవిలో కొనసాగుతారు. లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో కొనసాగుతారు. ఉప లోకాయుక్తగాజస్టిస్ జగ్జీవన్‌కుమార్ హైకోర్టు న్యాయమూర్తి (జడ్జి) హోదాలో కొనసాగుతారు.

## యాదద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నల్గొండ జిల్లా దామరచర్ల లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో చోటు చేసుకున్న ఈ అగ్నిప్రమాదంలో పవర్ ప్లాంట్ లోని మొదటి యూనిట్లో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రంగ ప్రవేశం చేసి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. ఈ అగ్ని ప్రమాద ఘటనలో కొన్ని కేబుల్స్ కాలిపోగా ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు. థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1 ట్రయల్ రన్ లో అపశ్రుతి అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఫైనల్ గా మంటలను అదుపులోకి తీసుకు రాగలిగారు. ఈ సంఘటన కారణంగా మొదటి యూనిట్లో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.

మొదటి యూనిట్ లోని బాయిలర్ నుండి ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయని సమాచారం. యాదాద్రి పవర్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం ఇక ఇదే సమయంలో దిగువన వెల్డింగ్ పనులు కొనసాగుతున్న క్రమంలో లీకైన ఆయిల్ కారణంగా మంటలు ఒక్కసారిగా ఎగసి పడ్డాయని సమాచారం.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1 ప్రారంభించడానికి అధికారులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఇక ఈ దుర్ఘటన పైన దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీస్ అధికారి పిటిఐకి తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి ప్రాణ నష్టం లేదు నల్గొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యొక్క యూనిట్ ఒకటిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు.



## కృష్ణ జన్మభూమి కేసు..
## అలహాబాద్ హైకోర్టును సమర్థించిన సుప్రీం కోర్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మథుర కృష్ణ జన్మభూమి షాహి ఈద్గా వివాదంలో కేంద్రాన్ని, భారత పురావస్తు సర్వే (ఎఎస్ఐ)సంస్థను ప్రతివాదులుగా చేర్చేందుకు హిందు కక్షిదారులను అనుమతించడంలో అలహాబాద్‌హైకోర్టు ప్రాథమికంగా సరైన రీతిలో వ్యవహరించిందని సుప్రీం కోర్టు సోమవారం స్పష్టం చేసింది. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఎ)ను, ఎఎస్ఐని ప్రతివాదులుగా చేసేందుకు రెండు దావాలకు సవరణలు చేయడానికి, పిటిషనర్లను అలహాబాద్ హైకోర్టు అనుమతించింది. దావా సవరణను అనుమతించడంలో ప్రాథమికంగా తప్పు ఏమీ లేదని ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. సవరించిన పిటిషన్‌కు సమాధానాలు దాఖలు చేయవచ్చునని బెంచ్ సూచించింది. 'ఒక విషయం సుస్పష్టం. అసలు పిటిషన్ (రెండు దావాలు)కు హిందు ఫిర్యాదీలు సవరణ చేయడాన్ని అనుమతించవలసి ఉంటుంది' అని సిజెఐ అన్నారు. అయితే, మథుర ట్రస్ట్ షాహి మస్జీద్ ఈద్గా నిర్వహణ కమిటీ పిటిషన్ విచారణను బెంచ్ వాయిదా వేసింది. దానిని ఈ వివాదానికి సంబంధించిన ఇతర పెండింగ్ కేసులతో కలపాలని బెంచ్ సూచించింది. 'దేవత భగవాన్ శ్రీ కృష్ణ లాలా విరాజ్‌మాన్ తదుపరి మిత్రుడు', 'దేవ్ ఆస్థాన్ శ్రీ కృష్ణ జన్మ భూమి', హరి శంకర్ జైన్ సహా మరి తొమ్మిది మందిని కక్షిదారులుగా మసీదు కమిటీ చేసింది.

### ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ

## వైస్ చైర్‌పర్సన్‌గా శాంతికుమారి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సీఎస్ పదవి నుంచి విరమణ తర్వాత శాంతి కుమారికి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆమెను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) వైస్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, ఆమెకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. సీఎస్‌గా ఈ నెల 30న ఆమె పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే.




## నేవీలోకి 26 రాఫెల్ విమానాలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత నావికాదళం కోసం 26 రాఫెల్–ఎం యుద్ధ విమానాలను అందించేందుకు రూ. 63వేల కోట్ల ఒప్పందంపై సోమవారం భారత్–ఫ్రాన్స్‌లు సంతకాలు చేశాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 21 సింగిల్ సీటర్ జెట్‌లు, రెండు సీట్లతో కూడిన నాలుగు జెట్ ఫైటర్లను 2031 నాటికి అందించే అవకాశం వుందని భావిస్తున్నారు. విమానాల నిర్వహణ, అవసరమైన మౌలిక వసతుల సదుపాయాలు, సిబ్బంది శిక్షణ వంటివి కూడా ఈ ఒప్పందంలో భాగంగా వున్నాయి. నౌసేన్ భవన్‌లో జరిగిన ఈ ఒప్పంద సంతకాల కార్యక్రమంలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, నావికా దళ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ,. భారత్‌లోని ఫ్రెంచ్ రాయబారి థోరీ మాథౌ హాజరయ్యారు. ఈ ఒప్పందంపై సంతకం చేయడానికి ఫ్రాన్స్ రక్షణ మంత్రి భారత్‌కు రావాల్సి వుంది. కానీ వ్యక్తిగత కారణాల రీత్యా ఆ పర్యటన వాయిదా పడింది. దీంతో ఇరుదేశాల రక్షణమంత్రులు వర్చువల్‌గా సమావేశానికి హాజరైనట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది పూర్తిగా భారత్–ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందమని వివరించాయి. దీనితో పాటు ద్వైపాక్షిక రక్షణ సహకారం బలోపేతమే లక్ష్యంగా ఇరు దేశాల ప్రభుత్వాలు, వాణిజ్య వర్గాల మధ్య అనుబంధ ఒప్పందాలు కూడా జరిగాయి. నావికాళంలోకి వచ్చే ఈ రెండు కొత్త ఆయుధాలు విమాన వాహక నౌకలైన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యల్లో మొహరిస్తారు. దీంతో హిందూ మహా సముద్రంలో భారత నావికాదళం శక్తి సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయి. కాలం చెల్లిన మిగ్–29 దళం స్థానంలో ఇవి చేరతాయి. ప్రస్తుతం భారత నావికాదళంలో మాత్రమే ఈ యుద్ధ విమానం వుంది. కాగా, ప్రస్తుతం భారత వాయుసేన మొత్తంగా 36 రాఫెల్ యుద్ధ విమానాలను వినియోగిస్తోంది. తాజాగా నావికా దళం కూడా వీటిని కొను గోలు చేస్తుండడం వల్ల రెండు దళాల మధ్య సమన్వయం పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. అలాగే బడ్డీ–బడ్డీ రీ ఫ్యూయలింగ్‌కు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఓ ఫైటర్ జెట్ రీ ఫ్యూయలింగ్ పాడ్ సాయంతో మరో ఫైటర్ జెట్‌లో ఇంధనం నింపడాన్ని ఇలా అంటారు. అప్పుడు భారీ ఇంధన ట్యాంకర్ విమానాల అవసరముండదని కేంద్రం పేర్కొంటోంది.

## రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానం





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపది ద్రౌపది ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి కేంద్ర ప్రభుత్వం జనవరిలో పద్మ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. 139 మందికి కేంద్ర ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషన్, 113 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. వైద్యరంగంలో దువ్వూరి నాగేశ్వర్‌రావుకు పద్మభూషణ్, ప్రజా వ్యవహారాల కేటగిరిలో మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ తెలంగాణ నుంచి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా దువ్వూరి నాగేశ్వర్‌రావు పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. అలాగే, చిత్ర పరిశ్రమ నుంచి బాలకృష్ణ, తమిళ నటుడు అజిత్ కుమార్, అరిజిత్ సింగ్‌తో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతి నుంచి పద్మ అవార్డులను అందుకున్నారు.

## కేటీఆర్‌కు జిమ్‌లో ప్రమాదం..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రమాదానికి గురయ్యారు. జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా ఆయన గాయపడ్డారు. వెన్నుపూసలో గాయం కావడంతో కొద్దిరోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని కేటీఆర్ తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతా ద్వారా వెల్లడించారు. అలాగే వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్కడ బిగిసింది పిడికిళ్లు కాదు.. పిడుగులు అని వ్యాఖ్యానించారు. అవి స్వరాలు కాదు.. భాస్వరాలు అని పేర్కొన్నారు. నాడు చెరలబడ్డ తెలంగాణ విముక్తి కోసం.. నేడు చెరబట్టిన తెలంగాణ విముక్తి కోసం జనాలు కదిలివచ్చారని కేటీఆర్ అన్నారు. లాఠీలు, తూటాలు, కేసులు, జైళ్లు .. ఈ నేలకు కొత్త కాదని తెలిపారు. నాడు స్వాతంత్ర్య సమరం నుంచి, సాయుధ రైతాంగ పోరాటం వరకు, నాన్ ముల్కీ ఉద్యమం నుంచి 2014 తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఈ పిడికిళ్లే పిడుగులై గర్జించాయని అన్నారు. ఈ అరాచక, అసమర్థ కాంగ్రెస్ పాలనను పారద్రోలే వరకు.. గర్జిస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు.

# పాక్ యూట్యూబ్ ఛానెళ్లపై బ్యాన్

**బలగం టీవి, హైదరాబాద్**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ మరో నిర్ణయం తీసుకున్నది. పాకిస్తాన్‌కు చెందిన 16 యూట్యూబ్ ఛానళ్లను నిషేధించింది. ఉగ్రదాడి తర్వాత రెచ్చగొట్టే, సున్నితమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసినందుకు, భారత్, సైన్యంపై తప్పుడు కథనాలు ప్రచారం చేయటంతో భారత్‌లో మొత్తం 63 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్న ఈ యూట్యూబ్ ఛానెళ్లను బ్యాన్ చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సిఫారసుల మేరకు ఈ యూట్యూబ్ ఛానెళ్ల నిషేధం జరిగింది. భారత్ నిర్ణయంతో పాక్‌కు చెందిన సదరు యూట్యూబ్ ఛానెళ్లు కనిపించటం లేదు. డాన్, సమా టివి, ఎఆర్‌వై, జియో, బోల్, రఫ్తార్, సునో న్యూస్ వంటి వార్త ఛానెళ్లు కూడా ఇందులో ఉన్నాయి. జర్నలిస్టులు ఇర్షాద్ భట్టి, అస్మా షిరాజీ, ఉమర్ చీమా, మునీబ్ ఫరూక్‌ల యూట్యూబ్ ఛానెళ్లు కూడా నిషేధానికి గురయ్యాయి. పాకిస్తాన్‌కు చెందిన మాజీ క్రికెటరల్ షోయబ్ అక్తర్‌కు చెందిన అకౌంట్ కూడా కనిపించలేదు. ది పాకిస్తన్ రిఫరెన్స్, సమా స్పోర్ట్స్, ఉజైర్ క్రికెట్, రజి నామా వంటి యూట్యూబ్ ఖాతాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. జాతీయ భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో ఈ కంటెంట్‌ను తొలగించినట్టు ఆయా ఛానెళ్లల్లో సందేశం కనిపిస్తున్నది.

# పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఎ దర్యాప్తు

**బలగం టీవి, హైదరాబాద్**




జమ్ము కాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తు ప్రారంభించింది. కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దర్యాప్తు బాధ్యతలను జమ్ముకాశ్మీర్ పోలీసుల నుంచి ఎన్ఐఎ అధికారికంగా తీసుకుంది. ఆదివారం ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రత్యక్ష సాక్షుల విచారణను ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనపై భారత భద్రతా బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఎన్ఐఎ తన దర్యాప్తులో భాగంగా వీరి సహకారాన్ని కూడా తీసుకోనుంది. ఘటన జరిగిన సమయంలో ఉగ్రవాదులను చూసిన పర్యాటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటన సమయం లో ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పహల్గాంలోకి ప్రవేశించే, నిష్క్రమించే ప్రాంతాల్లో ఫోరెన్సిక్ బందం సహాయంతో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. కాగా బైసరన్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ముష్కరులు కాల్పులు జరిపిన విషయం తెలుసుకొని తొలుత కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు (సిఆర్‌పిఎఫ్) క్విక్ యాక్షన్ టీమ్ స్పందించిన సంగతి విదితమే. 25 మంది కమాండోలతో కూడిన బందం రాళ్లు, బురద మార్గంలో దాదాపు 40–45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి ఘటనాస్థలానికి చేరుకుంది. వెంటనే పహల్గాం చుట్టూ సిఆర్‌పిఎఫ్ యూనిట్ చెక్‌పోస్టులు, ఘటనా స్థలానికి సమీపంలో సురక్షిత పాయింట్లను ఏర్పాటు చేసింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని పర్యాటకులను ఇతర ప్రాంతాలకు తరలించిన సంగతి తెలిసిందే.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

**బలగం టీవి, హైదరాబాద్**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత ఈ కేసును జస్టిస్ కె. లక్ష్మణ్ కొట్టివేశారు.సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి రూ. 2500 కోట్లు పంపించారంటూ కేటీఆర్ ఆరోపించారు. మున్సిపల్ శాఖను సీఎం రేవంత్ రెడ్డి తన ఆధీనంలో ఉంచుకొన్నారని ఆరోపించారు. ఆయనకు ముడుపులు చెల్లిస్తేనే భవనాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. అలా వసూల్ చేసిన నగదు రూ 2500 కోట్లు ఢిల్లీలోని పార్టీ పెద్దలకు పంపారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత బత్తిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించారు హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. బంజారాహిల్స్ పోలీసులకు పంపారు. దీంతో కేటీఆర్‌పై 504, 505(2) కేసులు నమోదు చేశారు. దీనిపై కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు ఈ కేసును కొట్టి వేసింది.

# కత్తులతో దాడి చేసి 30 గొర్రెలు చోరీ..!

**బలగం టీవి, హైదరాబాద్**

గొర్రెలను దొంగిలించడానికి వచ్చిన దుండగులు వాటికి కాపలాగా ఉన్న ఓ కానిస్టేబుల్, మరో వ్యక్తిని కత్తులతో గాయపరిచి సుమారు 30 గొర్రెలను దొంగిలించిన ఘటన రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో నివాసం ఉంటున్న రాసూరి నవీన్ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అతను తన తండ్రి అనారోగ్య కారణంతో ఆస్పత్రిలో ఉండడంతో అదే ప్రాంతంలో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయ సమీపంలోని సంపత్ బాల్ రెడ్డి పొలంలో సుమారు 250 గొర్రెలకు తన బావమరిది శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం అర్ధరాత్రి కాపలాగా ఉన్నాడు. అయితే సోమవారం తెల్లవారుజామున సుమారు 8 నుంచి 9 మంది గుర్తు తెలియని యువకులు వచ్చి ఇద్దరిపై కత్తులతో దాడి చేసి సుమారు 30 గొర్రెలను దొంగిలించి బొలెరోలో పరారయ్యారు. అలాగే వారి సెల్‌ఫోన్లు, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. దాంతో బాధితులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఔటర్ రింగ్ రోడ్డుపై ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

# అఖిలపక్ష భేటీకి మోడీ ఎందుకు రాలేదు?



- **కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే**

**బలగం టీవి, రాంచీ**

ప్రధాని మోడీపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు ఇటీవల ఢిల్లీలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి మోడీ గైర్హాజరు కావడాన్ని ఆయన తప్పుపట్టారు. "అన్ని పార్టీల ముఖ్య నేతలు ఆ సమావేశానికి వచ్చారు. కానీ ప్రధాని మోడీ రాకపోవడం బాధాకరం. బీహార్‌లో రాజకీయ ప్రసంగం ఇవ్వడానికి మాత్రం ఏప్రిల్ 24న మోడీ వెళ్లారు. అఖిలపక్ష సమావేశానికి హాజరై ప్రభుత్వం వద్దనున్న ప్రణాళికను ప్రధాని వివరించి ఉండా ల్సింది. మా నుంచి ఎలాంటి సహకారం కావా లో అడిగి ఉండాల్సింది" అని ఖర్గే వ్యాఖ్యానిం చారు. సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలో పాల్గొని పార్టీ చీఫ్ ప్రసంగించారు.

"కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ నేతకు భారతదేశమే ముఖ్యం. అదే పరమావధి. దేశం తర్వాతే పార్టీలు, మతాలు. దేశం కోసం మనమంతా ఏకమై నిలవాలి. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అందరూ సమర్థించాలి. కాంగ్రెస్ పార్టీ ఐకమత్యం గురించి చెబుతుంటే బీజేపీ విభజనవాదంతో ముందుకుపోతోంది. భారతదేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైంది. దాని ప్రకారమే దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థలు నడుస్తాయి. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ శక్తి వల్లే టీ అమ్ముకునే వ్యక్తి కూడా ప్రధానమంత్రి కాగలిగారు. పహల్గాం ఉగ్రదాడితో మనదేశం ప్రతిష‌కు భంగం కలిగింది. అటువంటి కష్టకాలంలో ప్రధాని మోడీ బీహార్‌లో ఎన్నికల ప్రచారం చేయడం దారుణం. మోడీ సర్కారు వల్ల మన దేశానికి ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే మిగిలాయి. అలాంటి పాలకులు దేశాన్ని బలహీనపరుస్తారు. మోడీజీ 56 ఇంచుల ఛాతీ చిన్నదైపోయింది.అని విమర్శించారు.

"కేంద్ర సర్కారు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. వాటిని వాడుకొని కాంగ్రెస్ నేతలను వేధిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎదగడాన్ని బీజేపీ లాంటి పార్టీలు ఓర్వలేవు. మేం అణచివేతకు కునారిల్లిపోయే రకం కాదు. కాంగ్రెస్ కాస్త బలంగా కనిపించగానే బీజేపీ వాళ్లు కలవరపడతారు. మా పార్టీ నేతలను బలహీనపర్చేందుకు కుట్రలు పన్నుతా రు. కొందరు నేతలపై కేసులు పెట్టినంత మాత్రాన యావత్ ప్రజాస్వామిక వ్యవస్థ బలహీనపడదు. బీజేపీ వాళ్లు దేవుడి పేరు స్మరిస్తారో లేదో తెలియదు కానీ, మా నేతల పేర్లయితే నిత్యం స్మరిస్తారు. మా స్థాయిలో భారత దేశానికి ఏ పార్టీ కూడా సేవలు చేయలేదు. ఎరువుల భద్రత, ఉపాధి హామీ పథకం, విద్యా వసతులను మేమే దేశ ప్రజలకు ఇచ్చాం. తప్పకుండా మేం కేంద్రంలో అధికారంలోకి వస్తాం" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏసీబీ వలలో శామీర్‌పేట ఎస్సై

**బలగం టీవి, హైదరాబాద్**

లంచం తీసుకుంటున్న పోలీస్ అధికారిని ఎసిబి అధికారులు పోలీస్ స్టేషన్లోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 20న నూనె విక్రయంపై నమోదైన చీటింగ్ కేసు నుంచి స్టేషన్ బెయిల్ ఇచ్చి తప్పించేందుకు శామీర్ పేట ఎస్ఐ పరశురాం నాయక్‌ను బాధితులు సంప్రదించారు. తనకు రూ.2 లక్షలు లంచం ఇవ్వాలని బాధితులను ఎస్ఐ డిమాండ్ చేశాడు. ఈ నెల 21న రూ. 2 లక్షలను బాధితులు తీసుకువచ్చి ఎస్ఐని కలవగా కారులో పెట్టాలని సూచించాడు. మరుచటిరోజు అందులో డబ్బులు తక్కువగా ఉన్నాయని, అదనంగా మరో రూ.25 వేలు కావాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి అధికారుల సూచనల మేరకు బాధితుడు రూ.22 వేలను ఎస్ఐతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు బాధితుడు వచ్చి ఎస్ఐని కలిసాడు. తన ఛాంబర్‌లో ఉన్న చెత్తబుట్టలో డబ్బులను వేయాలని ఎస్ఐ సూచించాడు. వెంటనే ఎసిబి సిటీ రేంజ్ యూనిట్ 2 అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కాగా, ఈ కేసులో ఎంతమందికి ప్రమేయం ఉందన్న కోణంలో విచారిస్తున్నామని తెలిపారు.

# భారత్ దాడి చేయడం ఖాయం

## పాక్ మంత్రి

**బలగం టీవి, హైదరాబాద్**

కశ్మీర్‌లో ఇటీవల పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ వైపు నుంచి సైనిక దాడి జరిగే అవకాశం ఉందని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ముహమ్మద్ ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి తర్వాత ఇరు అణ్వస్త్ర దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. సోమవారం నాడు ఇస్లామాబాద్‌లోని తన కార్యాలయంలో రాయిటర్స్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖ్వాజా ఆసిఫ్ మాట్లాడుతూ, "భారత్ నుంచి దాడి జరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే మేము మా బలగాలను పటిష్టం చేశాం. ఈ పరిస్థితుల్లో కొన్ని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది, ఆ నిర్ణయాలు తీసుకున్నాం" అని తెలిపారు. భారత దాడికి అవకాశం ఉందని తమ సైన్యం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని, అయితే దాడి ఎందుకు జరగనుందనే దానిపై మరిన్ని వివరాలను ఆయన వెల్లడించలేదు. పాకిస్తాన్ అత్యంత అప్రమత్తంగా ఉందని, తమ దేశ ఉనికికి ప్రత్యక్షంగా ముప్పు ఏర్పడితే తప్ప అణ్వాయుధాలను ఉపయోగించబోమని ఆసిఫ్ స్పష్టం చేశారు.

# 24 మంది నక్సలైట్ల లొంగుబాటు

**బలగం టీవి, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 24 మంది నక్సలైట్లు సోమవారం లొంగిపోయారని, వారిలో 14 మందిపై మొత్తం రూ. 28.50 లక్షల రివార్డు కూడా ఉందని పోలీస్ అధికారి తెలిపారు. తెలంగాణ సరిహద్దులోని బీజాపూర్ కొండల్లో ఏప్రిల్ 21న దాదాపు 24000 మంది భద్రతా బలగాలు నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టేసరికి వారు లొంగిపోయారని, వారిలో 11 మంది మహిళా నక్సల్స్ కూడా ఉన్నారని ఆ అధికారి వివరించారు. మావోయిస్టు సిద్ధాంతాలు అమానవీయంగా ఉన్నాయని విసిగిపోయి వారు లొంగిపోయినట్లు బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ జితేందర్ కుమార్ యాదవ్ తెలిపారు లొంగిపోయిన నక్సల్స్‌లో సుద్రు హేమ్లా(33), ఊర్మిళా(36), జయ్‌మోతి పుణెం(24), మంగు పుణెం(21), శామ్‌నాథ్ కుంజం(40), చైతు కుర్సం(30), బుచి మాధ్వి(25), సుక్మతి ఉర్సా(28), సోమ్లి హేమ్లా(45), బుజ్జి పదం(20), సుక్కో పుణెం(28), హిడ్మె వెకో(22), సోని కొర్సా(30), లచ్చు తతి(25) ఉన్నారు. లొంగిపోయిన ఈ నక్సలైట్లు అందరికీ ప్రభుత్వ పాలసీ ప్రకారం రూ. 50 వేల చొప్పున ఒక్కొక్కరికి అందించడమేకాక, పునరావాసం కల్పించనున్నారని ఎస్‌పి తెలిపారు.

# ప్రధానితో రక్షణమంత్రి భేటీ

**బలగం టీవి, హైదరాబాద్**

జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదుల దాడి అనంతరం ప్రస్తుతం జమ్మూకశ్మీర్ క్రమంగా కోలుకుంటోంది. కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రధానిని కలిసి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న భద్రతా పరిస్థితిని పూర్తిగా వివరించారు. ఏప్రిల్ 22న 26 మందిని బలిగొన్న టెర్రరిస్ట్ ల దాడి వెనుకఉన్న కుట్రదారులను శిక్షించేందుకు భారత ప్రభుత్వం ఆలోచిస్తున్న తరుణంలో ఈ బ్రీఫింగ్ జరిగింది. ఈ దాడికీ, సరిహద్దు ఆవలి దేశంతో గల సంబంధాలు కీలకం అని పేర్కొంటూ, భయంకరమైన టెర్రర్ దాడి పట్ల దేశంలోనూ, విదేశాలలోనూ విస్తృతంగా వ్యక్తమైన తీవ్ర ఆగ్రహం నేపథ్యంలో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని భారత్ స్పష్టంచేసింది.ప్రధానితో రక్షణమంత్రి భేటీపై అధికార ప్రకటన ఏదీ వెలువడలేదు. పహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు, కుట్రదారులకు గట్టిగా శిక్ష తప్పదని ప్రధాని మోదీ మన్ కా బాత్ కార్యక్రమంలో స్పష్టంచేశారు. టెర్రరిస్ట్ లపై పోరులో మొత్తం ప్రపంచం 140 కోట్ల భారతీయులకు అండగా నిలుస్తోందని ప్రధాని అన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డితో కొత్త సీఎస్ భేటి

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నేడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్ పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. కాగా, ప్రస్తుత సిఎస్ శాంతికుమారి ఈ నెల 30వ తేదిన పదవీ విరమణ చేయనున్నారు.. ఆమె స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం రామ కృష్ణారావును చీఫ్ సెక్రటరీగా నియమించింది.. ఆయన వచ్చే నెల ఒకటో తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు..

# అత్యాధునిక పద్ధతుల్లో నిత్యాన్నదాన సత్రం నిర్మాణం..



## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**

అత్యాధునిక పద్ధతుల్లో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన సత్రం నిర్మిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శృంగేరి పర్యటనలో భాగంగా సోమవారం కొల్లూరు మూకాంబిక అమ్మవారినీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొల్లూరు మూకాంబిక అమ్మవారి సన్నిధిలో నిత్య అన్నదాన సత్యాన్ని,వంటశాల, డైనింగ్ హాల్, క్యూలైన్లను అది శ్రీనివాస్ పరిశీలించారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి పోన్నం ప్రభాకర్ చొరవతో శ్రీ రాజరాజేశ్వర స్వామి అన్నదాన సత్రం నిర్మాణం కోసం 35 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. గత సంవత్సరం నవంబర్ 20 న శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన అభివృద్ధి విస్తరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అన్నదాన సత్రం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న రాజన్న భక్తుల సౌకర్యార్థం తిరుమల శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టడం కోసం ఇప్పటికే టెండర్లు పూర్తయి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. ఇక్కడ ఆలయ ఈవో వినోద్ రెడ్డి,ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, అర్చకులు శరత్, సురేష్, శర్మ,ఏఈ రామకిషన్ రావు తదితరులు ఉన్నారు.

# భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



## -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, సిరిసిల్ల**

భూ సమస్యల పరిస్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ హాజరై మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు – భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని అన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, భూముల మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తామని,పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని, పాసుపుస్తకాలలో భూమి పటం ఉంటుందని అన్నారు. ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని అన్నారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూభారత చట్టాన్ని తీసుకువచ్చిందని,రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని,గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని అన్నారు.


ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, ఇన్చార్జి తహసిల్దార్ విజయ్ భాస్కర్ రెడ్డి, అధికారులు సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## భక్తులతో కిక్కిరిసిన ఎములాడ క్షేత్రం..

**బలగం టీవీ, వేములవాడ**

శ్రీ రాజరాజేశ్వర స్వామిని శుక్రవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యం లో పలువురు సిబ్బంది లడ్డు కౌంటర్లు, కళ్యాణ కట్ట, కొబ్బరి కాయలు కొట్టు స్థలము, క్యూ లైన్లు మొదలగు ప్రదేశాల్లో పర్యవేక్షించారు.



## కటీల్ దుర్గాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, మంగళూరు**

కర్ణాటక రాష్ట్రంలోని ప్రసిద్ధ కటీల్ దుర్గాపరమేశ్వరి ఆలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. మంగళూరు నుండి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటీల్‌లోని ఈ ఆలయానికి ఆయన ఆలయ ఈఓ కె. వినోద్, ఆర్కిటెక్ట్, స్థపతి మరియు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వెళ్లారు. ఆలయంలోని పూజా కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కార్యకర్తలకు చల్మెడ అభినందనలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బిఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ వేడుకలకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చి రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు.

# ఎండ తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గత పది రోజులుగా పెరుగుతున్న వేడి గాలులు, ఎండ తీవ్రత దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణాలు, వ్యవసాయ పనులు మానుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళితే తల రుమాలు, గొడుగు, టోపీ ధరించాలని, లేత రంగు దుస్తులు వేసుకోవాలని, నీరు వెంట తీసుకెళ్లాలని తెలిపారు.

వడదెబ్బ తగిలితే జ్వరం, తల తిరగడం, చెమట అధికంగా పోవడం, అపస్మారక స్థితికి చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లాలని లేదా ఆశా కార్యకర్తను సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు.



వేడిగాలులల వల్ల అనారోగ్యం బారిన పడకుండా ఉండడానికి కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, చెరుకు రసం వంటి పానీయాలు తీసుకోవాలని, ప్రతి గంటకు ఒక గ్లాసు నీరు త్రాగాలని, ఎయిర్ కూలర్లు, ఏసీలు ఉపయోగించాలని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స పొందాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత జాగ్రత్త వహించాలని డాక్టర్ రజిత విజ్ఞప్తి చేశారు.




## టౌన్ సీఐ వీర ప్రసాద్ జన్మదినం..

## రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) వీర ప్రసాద్ తన జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఆయన ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం, ఆశీర్వచన మండపంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ సి.ఐ. వీర ప్రసాద్‌కు స్వామివారి కండువాను అందజేశారు. అర్చక స్వాములు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరిశీలకులు ఎన్. రాజేందర్, జి. గిరిబాబు మరియు ప్రోటోకాల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## స్థంభంపల్లి గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బోయినపల్లి మండలం స్థంభంపల్లి గ్రామ గంజి వాగు వద్ద అసంపూర్తిగ ఉన్న హైలెవల్? వంతెన నిర్మాణాన్ని పూర్తి వెంటనే చేయాలని డిమాండ్? చేస్తూ స్థంభంపల్లి గ్రామం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి వినతి పత్రం జిల్లా కలెక్టర్ అందజేశారు.. ఈ కార్యక్రమంలో స్తంభంపెల్లి మాజీ సర్పంచ్ అక్కెనపల్లి జ్యోతి కరుణాకర్, మాజీ ఉపసర్పంచు బొంగాని అశోక్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భీరవెళ్ళిల్లి వెంకటేశ్వరరావు,ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తునికి తిరుమలేష్, గౌడ సంఘ అధ్యక్షుడు పులి లక్ష్మణ్, నాయి బ్రాహ్మణ సంఘం ఉప అధ్యక్షుడు తంగళ్ళపల్లి ఆంజనేయులు, రెడ్డి సంఘం అధ్యక్షులు వచ్చే లింగారెడ్డి,అంబేద్కర్ సంఘ అధ్యక్షులు అక్కెనపెల్లి శేఖర్, రజక సంఘం నాయకులు కోడూరు చందు, మారుపాక తిరుపతి, కొప్పుల మధు,అమ్ముల శ్యామ్,రాధ అజయ్,కొప్పుల కిరణ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిలుముల రమేష్, శాలివాహన సంఘ అధ్యక్షుడు రాచర్ల రాజేష్, కళ్యాణ్, అజయ్, మనోజ్, విజయ్, సురేష్, మోహన్ దాస్, రాములు, మహేష్, అంజయ్య, శంకర్ , పరశురాములు, భూమయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఆఖరి సెషన్‌లో 7 వికెట్లు



- రెండో టెస్టులో బంగ్లాదేశ్ జోరు
- జింబాబ్వే 227-9

**బలగం టీవీ, హైదరాబాద్**

స్వదేశంలో జింబాబ్వేతో జరగుతున్నరెండో టెస్టులో బంగ్లాదేశ్ జోరు చూపిస్తోంది. తైజుల్ ఇస్లాం(5-60) విజృంభణతో జింబాబ్వేను సమర్ధంగా కట్టడి చేసింది. టాస్ గెలిచిన పర్యటక జట్టుకు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(21), బెన్ కర్రాన్(21)లు శుభారంభం ఇవ్వగా.. జింబాబ్వే స్కోర్ దూసుకెళ్లింది. అయితే.. బెన్నెట్‌ను ఔట్ చేసిన తంజిమ్ హసన్ బంగ్లాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత నిక్ వెల్చ్(54), సీన్ విలియమ్స్(67)లు అర్ధ శతకాలతో చెలరేగారు. దాంతో, టీ సమయానికి 2 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసిన పర్యాటక జట్టు టీ సెషన్ తర్వాత కుప్పకూలింది. బంతి అందుకున్న తైజుల్ ఇస్లాం(5-60) జింబాబ్వేను గట్టి దెబ్బకొట్టాడు. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విజృంభణతో ఆఖరి సెషన్‌లో అనూహ్యంగా 7 వికెట్లు కోల్పోయింది. ప్రధాన ఆటగాళ్లు పెవిలియన్ చేరిన వేళ వికెట్ కీపర్ తఫజ్వా స్సిగా(18 నాటౌట్), బ్లెస్సింగ్ ముజరబని(2 నాటౌట్)లు ఆలౌట్ ప్రమాదాన్ని తప్పించారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్లు కోల్పోయి 227 రన్స్ చేసింది. బంగ్లా బౌలర్లలో నయీం హసన్ రెండు వికెట్లు పడగొట్టాడు.



# ట్రోలర్స్ పై బూమ్రా భార్య ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్**

తన కుమారుడు అంగడ్‌పై విమర్శలు చేస్తున్న వారిపై భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా భార్య సంజనా గణేషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినోదం కోసం తన కుమారుడి గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ఆదివారం ముంబై ఇండియన్స్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్న బుమ్రా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఇక ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు బుమ్రా భార్య సంజన గణేషన్ తన కుమారుడు అంగడ్‌తో కలిసి స్టేడియానికి వచ్చింది. బుమ్రా వికెట్ తీసినప్పుడు అంగడ్ గ్యాలరీలో చప్పట్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, ఆ సందర్భంగా అక్కడున్న కెమెరామెన్‌లు అంగడ్‌ను వీడియో తీశారు. మూడు సెకన్ల ఆ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు చిన్నారి అంగడ్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. కొంత మంది నెటిజన్లు డిప్రెషన్, ట్రామా వంటి పదాలు వాడుతూ బుమ్రా-సంజనాలను విమర్శించారు. దీనిపై స్పందించిన సంజన.. విమర్శకులకు ధీటుగా సమాధానమిచ్చారు.

'మీ వినోదం కోసం మా కుమారుడి పేరును లాగొద్దు. నేను, బుమ్రా మా కుమారుడిని సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తాం. ఎందుకంటే.. ఇంటర్నెట్‌లో ఎక్కువగా విద్వేషం, విషం చిమ్మే వాళ్లే ఉంటారని తెలుసు కాబట్టి. వేల కెమెరాలతో నిండిన క్రికెట్ స్టేడియానికి మా చిన్నారిని తీసుకురావడం వల్ల కలిగే ఇబ్బందులను నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను. కానీ మేము బుమ్రాకు మద్దతు ఇవ్వడానికి మాత్రమే ఇక్కడికి వచ్చామని అర్థం చేసుకోండి. మా కుమారుడు జాతీయ మీడియాలో గానీ, సోషల్ మీడియాలో గానీ వైరల్ అవ్వాలన్న ఆసక్తి మాకు లేదు. కేవలం 3 సెకన్ల వీడియోతోనే కొంతమంది కీబోర్డు వారియర్లు అంగడ్ గురించి ఏదేదో మాట్లాడేస్తున్నారు. మా బాబుకు ఇప్పుడు ఇంకా ఏడాదిన్నర వయసు మాత్రమే. కానీ మీరు ట్రామా, డిప్రెషన్ వంటి పెద్దపెద్ద పదాలు వాడుతూ విమర్శలు చేస్తున్నారు. మీరు చేస్తున్న విమర్శలు చూస్తుంటే.. సమాజం ఎటు పోతుందోనని ఆందోళనగా ఉంది. ఇది నిజంగా విచారకరం. మా జీవితాల గురించి మీకు ఏమీ తెలియదు. అలాంటప్పుడు మాపై మీ సొంత అభిప్రాయాలు సరికాదు. ఎదుటి వారి పట్ల దయతో వ్యవహరించండి' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం సంజన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

# వైభవ్ సూర్యవంశీ సంచలనం

- ఐపీఎల్‌లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన 14 ఏండ్ల కుర్రాడు
- గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 35 బంతుల్లోనే శతకం పూర్తి.
- 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 పరుగులు నమోదు చేసిన రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్
- 8 వికెట్ల తేడాతో గెలిచిన రాజస్థాన్ రాయల్స్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 35 బంతుల్లోనే అద్భుతమైన సెంచరీ సాధించి పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. దాంతో రాజస్థాన్ రాయల్స్ భారీ విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(101) విధ్వంసక సెంచరీతో కదంతొక్కగా.. యశస్వీ జైస్వల్(70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు.

ముందుగా టాస్ ఓడిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(39) ఎప్పటిలానే శుభారంభం ఇచ్చారు. వీరిద్దరు తొలి వికెట్ కు 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జోస్ బట్లర్ 26 బంతుల్లో 192 స్ట్రైక్ రేటుతో 3 ఫోర్లు, 6 సిక్సుల సాయంతో 50 పరుగులు అర్ధ శతకం బాదాడు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్(13), రాహుల్ తెవాతియా (9) విఫలమయ్యారు. ఆఖర్లో షారుక్ ఖాన్ (5 నాటౌట్) పరుగులు చేశాడు. జోఫ్రా ఆర్చర్ ఒక్క వికెట్ తీసి ఏకంగా 49 పరుగులు సమర్పించుకున్నాడు. మహీశ్ తీక్షణ 2/35 వికెట్లు, సందీప్ శర్మ 1/33 వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం రాజస్థాన్ 210 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(101) విధ్వంసక సెంచరీతో కదంతొక్కగా.. యశస్వీ జైస్వల్(70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. తొలి వికెట్‌కు 166 రన్స్ జోడించి రాజస్థాన్ విజయానికి పునాది వేశారిద్దరు. వైభవ్ ఔటయ్యాక రియాన్ పరాగ్(32 నాటౌట్) ధనాధన్ ఆడి లాంఛనం ముగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో మూడో విజయం సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్‌ను కిందికి నెట్టేసి 8వ స్థానానికి ఎగబాకింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

వైభవ్ చేసిన ఈ అద్భుత ప్రదర్శన వల్లే గుజరాత్ టైటాన్స్ తో జరిగిన తాజా మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదటి ఓవర్ మూడో బంతికి సిరాజ్ బౌలింగ్‌లో సిక్స్ బాది ఖాతా తెరిచిన వైభవ్.. నాలుగో ఓవర్లో తన అసలైన విశ్వరూపాన్ని బయటపెట్టాడు. ఇషాంత్ బౌలింగ్‌లో 6,6,4,0,6,4 బాదిన వైభవ్.. ఆ తర్వాతి ఓవర్లో రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టాడు. ఈ క్రమంలోనే వైభవ్ 17 బంతుల్లోనే తన తొలి హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఇక కరీమ్ జనత్ వేసిన 10 ఓవర్లలో అయితే సూర్యవంశీ వీరబాదుడే. వరుసగా 6,4,6,4,4,6 అంటూ ఏకంగా 30 పరుగులు పిండాడు. అనంతరం ఆ తర్వాతి ఓవర్లోనే సిక్స్ బాది.. ఐపీఎల్‌లో తన తొలి సెంచరీ నమోదు చేశాడు వైభవ్. తద్వారా ఐపీఎల్ చరిత్రలో భారత్ తరపున అత్యంత వేగంగా (35 బంతుల్లో) సెంచరీ చేసిన క్రికెటర్ గా నిలిచాడు.

## పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సినీ నటుడు, ఏపీ హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన పౌర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ సంప్రదాయ తెలుగు వస్త్రధారణ అయిన పంచెకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. భారతీయ సినిమా రంగానికి, సమాజానికి నందమూరి బాలకృష్ణ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఈ పద్మ భూషణ్ అవార్డును ప్రకటించిన విషయం విదితమే. నటుడిగా చిత్ర పరిశ్రమకు చేసిన సేవలతో పాటు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

## శ్రీ విష్ణు సింగిల్ ట్రైలర్ విడుదల..

**బలగం టీవీ, హైదరాబాద్**




శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'సింగిల్' సినిమా సెట్స్ పై ఉంది. గీతా ఆర్ట్స్ సమర్పణలో, కాల్య ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. తాజాగా మూవీ ట్రైలర్ విడుదలైంది. ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీగా రూపొందినట్టు తెలుస్తుంది. గ్రీతా ఆర్ట్స్ అధినేత, మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిలిమ్స్ సంస్థతో కలిసి విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి సంయుక్తంగా మూవీని నిర్మిస్తున్నారు. చిత్రంలో శ్రీ విష్ణు రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్న పాత్ర పోషిస్తున్నట్టు అర్ధమవుతుంది. పగటిపూట కేర్ ఫ్రీ ఫ్రెండ్, రాత్రి వేళల్లో రొమాంటిక్ వ్యక్తిగా కనిపించి సందడి చేయనున్నాడు. ఇక ఈ చిత్రంలో 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ ఫేం బుల్లిరాజు సందడి చేయనున్నారు.

## 'బాహుబలి'.. రిరిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన పాన్-ఇండియా చిత్రం 'బాహుబలి'. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా రెండో భాగం 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' విడుదలై ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్ర బృందం అభిమానులకు ఓ తీపి కబురు అందించింది. బాహుబలి చిత్రాన్ని మళ్లీ థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్‌లో భారత్‌తో పాటు అంతర్జాతీయంగా కూడా 'బాహుబలి'ని రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాత శోభు యార్లగడ్డ తెలిపారు. ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై 'బాహుబలి' చిత్రాన్ని నిర్మించిన శోభు యార్లగడ్డ, 'బాహుబలి 2' ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 28న సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు.

